క్లుప్తంగా

మొక్కజొన్న పంటకు నిప్పు



శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన కౌలు రైతు గడ్డి రాజుకు చెందిన ఏకరం 20 గుంటల మొక్కజొన్న పంటకు మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన గడ్డి రాజు ఎకరం 20 గుంటల భూమిని కౌలు తీసుకుని మొక్కజొన్న పంట సాగుచేస్తున్నాడు. కాగా గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుబెట్టడంతో పంట పూర్తిగా కాలి బూడిద అయ్యిందని వాపోయాడు. రూ.1.20 లక్షల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చూశాడు.

కవితకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని జువాలజీ విభాగంలో పరిశోధకురాలు బూర్గుల కవితకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఎక్స్‌ట్రాక్షన్ ఐసోలేషన్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ బయోయాక్టివ్ ప్రిన్సిపాల్స్ ఫ్రమ్ కెలగ్రోపిస్ ప్రాసిరా రూట్ ఎక్స్‌ట్రాక్ట్ అండ్ ఎవాల్యూయేషన్ ఆఫ్ యాంటీ బ్యాక్టీరియల్ పొటెన్షియల్ అగెనిస్ట్ హ్యూమన్ పాథోజెనిక్ బ్యాక్టీరియా అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి కవితకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. కేయూ జువాలజీ విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి పర్యవేక్షణలో కవిత తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

విక్రమార్జున్ యాదవ్‌కు డాక్టరేట్



కాజీపేట అర్బన్: కాజీపేట మండలం రాంపేట గ్రామానికి చెందిన మాదం విక్రమార్జున్ యాదవ్‌కు భారత వ్యవసాయ పరిశోధన సంస్థ డాక్టరేట్ ప్రదానం చేసింది. న్యూఢిల్లీలోని నేషనల్ అగ్రికల్చర్ సైన్స్ కాంప్లెక్స్‌లో ఈనెల 22వ తేదీన నిర్వహించిన 63వ స్నాతకోత్సవంలో కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, వ్యవసాయ శాఖ సహాయ మంత్రులు రామనాథ్ ఠాకూర్, భగీరథ్ ఠాకూర్, శాఖ కార్యదర్శి దేవేశ్ చతుర్వేది, సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరావు నుంచి డాక్టరేట్ పట్టా స్వీకరించారు. విక్రమార్జున్ యాదవ్ ప్రస్తుతం జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు ముంబైలోని ప్రధాన కార్యాలయంలో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

హరికుమార్‌కు సాంస్కృతిక రత్న పురస్కారం



కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సంస్కృత విభాగంలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న హరికుమార్‌కు విజయవాడలోని విశ్వజ్యోతి విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో సంస్కృతి రత్న ఉగాది పురస్కారం -2025 లభించింది. ఈ సందర్భంగా కళాశాలలో ఆయనను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, అధ్యాపకులు మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ పుల్ల రమేష్, డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, డాక్టర్ కనకయ్య, శ్రీదేవి, చందులాల్, శ్రీనివాస్, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

గుడిసెవాసులకు పట్టాలిచ్చి వసతులు కల్పించాలి

నర్సంపేట : పట్టణంలోని సర్వే నంబర్ 813లోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలిచ్చి కరంట్, నీటి, ఇతర వసతులు కల్పించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రతినిధి కల్లెపల్లి ప్రణయ్‌దీప్, డీపీడీపీఎస్ ప్రజాదండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు అందె రవి, మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు తడుగుల విజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జంగ రమేశ్ అధ్యక్షతన గుడిసెవాసులు మంగళవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ప్రణయ్, రవి, విజయ్ దీక్షలను సందర్శించి మాట్లాడారు. నాలుగేళ్లుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదలు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు సత్వరమే స్పందించి పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, ఇతర వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. దీక్షలో నాయకులు ఉప్పలయ్య, మాలతీ లత, రత్నం, రవి, విమల, విజయ, సమ్మక్క, సరోజన, విజయ, సుధారాణి, స్వరూప, నిర్మల, వనజ, రామకృష్ణ, నాగలక్ష్మి, రాజు, రాజమణి, చక్రపాణితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ‘ఉపాధి’ పనులు

- మండల వ్యాప్తంగా పనిచేస్తున్న 1,562 కుటుంబాలు
- ఈనెల 31లోపు పనులు పూర్తిచేసేందుకు అధికారుల కసరత్తు
- కూలీల సంఖ్య పెంచేందుకు కృషి
- ఈజీఎస్‌లో వివిధ రకాల పనులను చేర్చిన ప్రభుత్వం



ఫాంపాండ్ పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

ఐనవోలు : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వేసవికాలం పని కల్పించేందుకు 2006 సంవత్సరంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సన్న, చిన్న కారు రైతులకు ఉపయోగకరంగా ఉండేందుకు రూ.99 వేల విలువ గల పశువుల, రూ.1.3లక్షల విలువగల గొర్ల షెడ్ల నిర్మాణం చేపడుతుంది. అదే విధంగా కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు రూ.2.99 లక్షల విలువ చేసే కోళ్ల షెడ్లను మంజూరు చేస్తుంది. రైతుకు ఉపయోగపడే పండ్ల తోటల పెంపకం, మునగ తోట, ఇంకుడు గుంతలు, ఫాం పాండ్లు, చేపల కుంటల నిర్మాణం, వ్యక్తిగత మరుగుదొడ్లు తదితర పనులను రైతులకు మంజూరు చేయడంతో అధికారులు ఉపాధి కూలీలతో పనులు చేయిస్తున్నారు. అవసరం ఉన్న రైతులు ఇలాంటి పనులను మంజూరు చేయించి లబ్ధిపొందాలని అధికారులు సూచిస్తున్నారు. ఇవే గాకుండా వ్యవసాయ పంట పొలాలకు ఉపయోగపడే రోడ్డు మార్గం, గ్రామానికి మరో గ్రామానికి మధ్య లింకు రోడ్లు, గుట్ట చుట్టూ కందకాలు, పంట పొలాలకు చెరువుల నుంచి కాల్వ నిర్మాణం తదితర పనులు ప్రస్తుతం గ్రామాల్లో ఊపందుకున్నాయి.

కూలీల సంఖ్య పెరగాలి

ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీల సంఖ్య క్రమంగా పెంచాలని అధికారులు క్షేత్ర స్థాయి సిబ్బందికి సూచిస్తున్నారు. మండల వ్యాప్తంగా ఉపాధి హామీ జాబ్ కార్డులు కలిగి ఉన్న కుటుంబాలు 7,628 ఉండగా అందులో యాక్టివ్‌గా ఉన్నవి 4,038గా అధికారులు గుర్తించారు. కానీ ప్రస్తుతం పనిచేస్తున్న కుటుంబాలు మాత్రం 1,562 ఉన్నట్లుగా నిర్ధారించారు. దీంతో ఉపాధి పనులు చేసే కూలీల సంఖ్యను పెంచాలని ఉన్నతాధికారులు పదే పదే క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశిస్తున్నారు.



ఉపాధి హామీలో మంజూరైన మునగ తోట

రూ.300 కూలి వస్తే బెటర్..

ఉపాధి హామీ పథకంలో కూలీలు పనిచేయకపోవడానికి పలు కారణాలు ఉన్నాయి. ఉపాధి పనికి పోతే కేవలం రూ. 150–180 వరకే కూలీ గిట్టుబాటు అవుతుందని, కూలీ డబ్బులు బ్యాంకు అకౌంట్‌లో నెల రోజుల తర్వాత జమ అవుతుండటం ప్రధాన సమస్యగా ఉంది. రూ. 300 కూలీ, వారంలోపు అకౌంట్‌లో డబ్బులు జమ అయితే కూలీల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. ఉపాధి పనికి వచ్చిన వారికి రూ.300 కూలీ డబ్బులు గిట్టుబాటు అయ్యేలా పనులు చేయించాలని ఉన్నతాధికారులు ఏపీఓ, ఫీల్డ్ అసిస్టెంట్లకు స్పష్టమైన ఆదేశాలిస్తున్నారు. అయితే చేసిన పనులకు త్వరగా బిల్లులు మంజూరై వారం లోగా డబ్బులు అకౌంట్లలో జమ అయ్యే విధంగా అధికారులు చర్య తీసుకోవాలని, ఎండ తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో పని ప్రదేశంలో తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.



ఉపాధి హామీలో నిర్మించిన షెడ్డు

114 రకాల పనులు పూర్తికావాలి

మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో అజోల్లా పెంపకం, పశువుల, కోళ్ల పాకలు, రోడ్డు పనులు, ఫాం పాండ్ల నిర్మాణం, కందకం ఏర్పాటు, మునగ తోట, నర్సరీలు, ఇంకుడు గుంతలు తదితర 114 పనులు వివిధ దశల్లో ఉండగా మార్చి 31వ తేదీ వరకు పూర్తి చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు ఈ ఆర్థిక సంవత్సరంలో కూలీలకు రూ.2.32 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేయగా ఈ వారంలో మరో రూ.18–20 లక్షలు వెచ్చించనున్నారు. ఉపాధి పనుల్లో లేబర్ కాంపోనెంట్ 60 శాతం, మెటీరియల్ కాంపొనెంట్ 40 శాతం ఉంటుంది. కాబట్టి కూలీల సంఖ్యను పెంచడంతో పాటు వేతనాలను పెంచగలిగితే అంతకు తగిన మెటీరియల్ లభించే అవకాశం ఉంటుందని, గ్రామాల్లో అధిక ప్రయోజనం చేకూరే అవకాశం కూడా ఉంటుందని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఉపాధి పనుల్లో నిర్మించిన మట్టి రోడ్డు



కొండపర్తిలో నిర్మాణ దశలో ఉన్న కోళ్ల షెడ్డు

రూ.300 కూలి గిట్టుబాటు అయ్యేలా పనులు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉపాధి కూలీలకు రూ.300 గిట్టుబాటు అయ్యేలా పనులను చేపిస్తున్నాం. రైతులకు ప్రయోజనకరంగా ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం వివిధ రకాల పనులను చేర్చింది. మండల వ్యాప్తంగా కొనసాగుతున్న 114 పనులను ఈనెల 31వ తేదీలోపు పూర్తిచేస్తాం. ఏప్రిల్ 1 తర్వాత కొత్త పనులకు రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- నక్క కుమారస్వామి, ఏపీఓ, ఐనవోలు

వేలం వాయిదా

శాయంపేట : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్, అంగడి వేలం పాటను వాయిదా వేస్తున్నట్లు శాయంపేట గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్, తహసీల్దార్ కల్వల సత్యనారాయణ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన షాపింగ్ కాంప్లెక్స్, అంగడి వేలానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా షాపింగ్ కాంప్లెక్స్ 7గదులు ఉండగా 5 గదులకే టెండర్లు వచ్చాయని తెలిపారు. మొత్తం 7 గదులకు టెండర్లు పడాలని, ఒక్కో గదికి ఇద్దరు చొప్పున టెండర్ వేస్తేనే ప్రక్రియ పూర్తిచేస్తామని తెలిపారు. అంగడి వేలం గత సంవత్సరం కంటే తక్కువ రేటుకు పాడడంతో అంగడి వేలాన్ని కూడా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 28న మళ్లీ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 27వ తేదీన సాయంత్రం 5గంటల లోపు షాపింగ్ కాంప్లెక్స్ డిపాజిట్ రూ.10వేలు చెల్లించాలని ఆయన తెలిపారు. పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

శాయంపేట : మండల కేంద్రంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రేగొండ మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన ఇచ్చంతుల సునీల్‌కు చెందిన (టీఎస్ 25బీ 1539) నంబర్ గల ట్రాక్టర్ ఇసుక లోడుతో మాందారిపేట నుంచి శాయంపేటకు వెళ్తోంది. మండల కేంద్రంలోని సెంటర్‌లో సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా ట్రాక్టర్ తారసపడినట్లు తెలిపారు. ఇసుకకు సంబంధించి ప్రభుత్వ అనుమతి పత్రాలు లేకపోవడంతో ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి సునీల్‌పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అనుమతి లేకుండా ఇసుక తరలింపు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఎస్సై కుమారస్వామి, కానిస్టేబుళ్లు రవీందర్, సతీశ్ ఉన్నారు.

రేషన్‌కార్డుల సర్వే పారదర్శకంగా చేపట్టాలి

తహసీల్దార్లు సత్యనారాయణ, జ్యోతివరలక్ష్మీదేవి

శాయంపేట : మండలంలోని గ్రామపంచాయతీ కార్యదర్శులు రేషన్ కార్డుల సర్వేను చేపట్టాలని తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మీసేవ ద్వారా రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యులను చేర్పించేందుకు దరఖాస్తు చేసుకున్న 1,246 మందికి ఆర్‌ఐలు సర్వే చేసి మొబైల్ యాప్‌లో పొందుపరుస్తారని, అలాగే ప్రజాపాలనలో నూతన రేషన్ కార్డుల వచ్చిన 2,148 దరఖాస్తులకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులకు మొబైల్‌యాప్‌లో యూసర్ ఐడీ లాగిన్ ఇచ్చామని, 24 గ్రామాలపంచాయతీల కార్యదర్శులు దరఖాస్తుదారుల ఇంటివద్దకు వివరాలు పూర్తిచేసి యాప్‌లో ఎంటర్ చేయాలన్నారు. ఆర్‌ఐ రమేశ్, ఆర్‌ఐ రమేశ్‌ఖన్నా, రెవెన్యూ సిబ్బంది నాగరాజు, రాజేశ్, పంచాయతీ కార్యదర్శులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

దామెర : గ్రామాల్లో నూతన రేషన్‌కార్డుల దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో ప్రజాపాలనలో భాగంగా ప్రజల్లో నూతన రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులను సమర్పించారని, వాటిని ఆన్‌లైన్‌లో నమోదును గతంలో పూర్తిచేశామన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన దరఖాస్తులను పంచాయతీ కార్యదర్శులు బుధవారం నుంచి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. వివరాలను యాప్‌లో నమోదు ఆమె సూచించారు. ఎంపీడీఓ కల్పన, ఎంపీఓ రంగాచారి, పంచాయతీ కార్యదర్శులతో పాటు తదితరులు పాల్గొన్నారు.



శాయంపేట : మాట్లాడుతున్న తహసీల్దార్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి

మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి

కమలాపూర్ : వసతి గృహ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలని బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి సూచించారు. మండలంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగది, భోజనశాల, స్టోర్ రూమ్, కూరగాయలు, ఆహార ధాన్యాన్ని, విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి, విద్యార్థులకు సూచించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా కష్టపడాలని అన్నారు. తల్లిదండ్రులకు, వసతి గృహానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రాజన్న, ట్యూటర్ రాజు, సిబ్బంది భద్రయ్య, విజయ, రమ, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రాంరెడ్డి

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి


ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుకుమార్

శాయంపేట : వేసవి కాలం సమీపిస్తున్న దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా గ్రామ పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుకుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఫణిచంద్ర అధ్యక్షతన గ్రామపంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించగా డీఈ హాజరై మాట్లాడారు. వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పైపులైన్లు, చేతి పంపులు. ఓహెచ్‌ఎస్‌ఆర్ నిచ్చెన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో నీటి సమస్యలు ఉంటే అందుబాటులో ఉన్న నిధులతో పనులు చేసేందుకు నివేదిక పంపించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఈ వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈ మధుకుమార్

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి



డిజిటల్ తరగతులను పరిశీలిస్తున్న నాయకులు

కమలాపూర్ : ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందని బీఎస్పీ నాయకుడు పల్లె ప్రశాంత్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల కార్యదర్శి కత్తి రమేశ్ తెలిపారు. బహుజన బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని కన్నూరు ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను మంగళవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మౌలిక వసతుల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా చేపట్టిన పనులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందా, మధ్యాహ్న భోజన పథకం అమలు, బాల, బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్లు ఉన్నాయా, సురక్షిత మంచినీరు అందిస్తున్నారా అనే విషయాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తమ సంపూర్ణ సహకారం ఉంటుందని, విద్యార్థుల సంఖ్య పెంచాలని ఉపాధ్యాయులను కోరారు. నాయకులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



శాయంపేట : మండలంలోని మైలారం గ్రామంలో పేకాడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మైలారం గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గ్రామంలోని చల్లా అమరేందర్ ఇంటి వద్ద కొందరు వ్యక్తులు పేకాడుతున్నారని సమాచారం వచ్చిందన్నారు. దీంతో దాడులు నిర్వహించి పేకాడుతున్న చల్లా అమరేందర్, నర్ర కుమారస్వామి, కన్నా చానిక్య, జూపాక మహేందర్, దూదిపాల రాంరెడ్డి, జక్కుల కృష్ణమూర్తిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.17,520 నగదు, 6 సెల్‌ఫోన్లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఏఎస్సై కుమారస్వామి, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, ఖలీల్, ప్రసాద్, రాజలు ఉన్నారు.

సహకార సంఘం అభివృద్ధే ధ్యేయం



ఎల్కతుర్తి : ‘ది.విశాల సహకార సంఘం’ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్ స్పష్టం చేశారు. మంగళవారం విశాల సహకార సంఘం ఆవరణలో 70వ వార్షిక మహా సభలో ఆయన మాట్లాడారు. సహకార సంఘంలో 4,500మంది సభ్యులు ఉన్నారని చెప్పారు. గతంలో 450మంది సభ్యులకు కేవలం 85వేలు మాత్రమే ఉన్న సంఘాన్ని ఇప్పుడు 1కోటి 85లక్షలు వాటా ధనానికి చేరిందన్నారు. పాలకవర్గ సభ్యులు, రైతుల సహకారంలో వెనుకబడిన బ్యాంక్‌ను ప్రస్తుతం లాభాలు, అభివృద్ధిలో ముందంజలో ఉంచినట్లు చెప్పారు. గత ఐదేళ్ల క్రితం సిబ్బందికి కనీసం జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉండేదని, సీ–గ్రేడ్ బ్లాక్ లిస్టులో ఉన్న బ్యాంక్‌ను ఏ–గ్రేడ్‌లోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. అలాగే రైతులకు అందుబాటులో ఫర్టిలైజర్ ఉంచుతున్నామని, యూరియా కేవలం రూ.270 కే అందిస్తున్నామన్నారు. అలాగే రైతులకు రూ.90లక్షల దీర్ఘకాలిక రుణాలు ఇచ్చినట్లు చెప్పారు. రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో వడ్డీలు చెల్లించి బ్యాంక్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. పాలకవర్గ సభ్యులు సూరయ్య, వెంకట్రావు, శ్రీనివాస్, మహేందర్, ఐలయ్య, సమ్మక్క, రాజిరెడ్డి, సమ్మయ్య, కృష్ణమూర్తిశర్మ, పోచయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

మెట్టుగుట్ట హుండీ ఆదాయం లెక్కింపు



మడికొండ: కాజీపేట మండలం మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి హుండీల లెక్కింపును అధికారుల సమక్షంలో మంగళవారం చేపట్టారు. దుర్గేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రసాద్ పర్యవేక్షణలో కానుకలను లెక్కించగా, శివాలయం హుండీ ఆదాయం రూ.2,57,619, రామాలయం హుండీ ఆదాయం రూ.37,648 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శేషుభారతి వివరించారు. అలాగే, సేవా టికెట్ల విక్రయం ద్వారా రూ.4,27,282 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు పాల్గొన్నారు.

హత్యచేసిన నిందితుడిని ఉరి తీయాలి



మాట్లాడుతున్న మహేందర్

ఆత్మకూరు : రాష్ట్రంలో రోజురోజుకు న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని, న్యాయవాదిని హత్య చేసిన నిందితుడిని ఉరి తీయాలని ప్రముఖ న్యాయవాది, అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని చంపాపేటలో అక్రమ సంబంధాన్ని పెట్టుకున్న ప్రియురాలిని పిలిపించాలని నిందితుడు దస్తగిరి దౌర్జన్యం చేస్తూ ఎలాంటి తప్పు చేయని న్యాయవాది ఇజ్రాయిల్‌ను అతికిరాతకంగా చంపడం సభ్య సమాజానికే సిగ్గుచేటన్నారు. వెంటనే నిందితుడిని ఉరితీయాలని, న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని ఆయన కోరారు. ఇలాంటి సంఘటనలను అరికట్టేందుకు న్యాయవాదులకు లైసెన్స్ గన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనను పౌరులు, పౌర సమాజం వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేశ్, దళిత బహుజన జిల్లా నాయకుడు పెరుమాండ్ల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు అశోక్, నాయకులు భాస్కర్, కుమారస్వామి, రాజు, నరసయ్య, శ్రీకాంత్, నవీన్, ప్రశాంత్, లక్ష్మణ్, కౌశిక్, సిద్దార్థతో పాటు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి

ఎల్కతుర్తి : గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి అన్నారు. ఎల్కతుర్తి మండలంలోని దామెర గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ప్రతీ గ్రామంలో వివిధ వీధుల్లో సీసీరోడ్ల నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. దామెరలో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేసినట్లు తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంబాల శ్రీకాంత్, రమేశ్, ఠాకూర్, రాజేందర్, రమణారెడ్డి, కొమురయ్య, ప్రభాకర్, రాములు, ఆదామ్, సుధీర్, తోట రవి, బాబురావు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వన్ నేషన్ - వన్ ఎలక్షన్‌తో దేశానికి మేలు

దామెర / పరకాల : వన్ నేషన్ – వన్ ఎలక్షన్‌తో దేశానికి మేలు జరుగుతుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోశ్‌కుమార్ అన్నారు. దామెర మండల కేంద్రంలో శ్రీరాంరెడ్డి, పరకాల పట్టణంలో సంతోశ్‌కుమార్ మంగళవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒకే దేశం–ఒకే ఎన్నిక నినాదంతో భారత దేశంలో ఏకకాలిక ఎన్నికల నిర్వహణ సంస్కరణకు దేశ ప్రజలందరూ మద్దతు పలకాలని అన్నారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్‌తో డబ్బు, సమయం ఆదా అవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు మాదారపు రతన్ కుమార్, సూర చందర్, కొట్టె రమేశ్, గండు ముఖేష్, గువ్వ సాంబయ్య, ఆలేటి పోశాలు, దామెర పృథ్వీరాజ్, ఎక్కలదేవి రమేశ్, గోగుల సమ్మిరెడ్డి, గండు పరుశరామ్, రమేశ్, రాజు, శ్రీనివాస్, మనోజ్ తదితరలు పాల్గొన్నారు.



దామెర : మాట్లాడుతున్న శ్రీరాంరెడ్డి

అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలి

ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గురి జాల శ్రీరాంరెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓ కల్పనకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆవాస్ యోజన పథకం ద్వారా లబ్ధిదారులను గుర్తించి మంజూరు చేయాలని అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు ఉన్నారు.